సాక్షి మహబూబాబాద్

గురువారం । 31 । ఆగస్టు । 2023



బాధితులకు సోదరులై..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలతో సర్వం కోల్పోయిన వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు చేయూతనందించారు. - 8లో▸



చంద్రయాన్-3పై అవగాహన

చంద్రయాన్-3పై ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.1⁰ /24.8⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎండలు దంచికొడుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆయిల్‌పామ్ రైతులకు ప్రోత్సాహం

- మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు



కురవి: రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు అన్నారు. బుధవారం సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలోని నూకల రంజిత్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ పంటలకు లేని ప్రోత్సాహకాలు ఆయిల్‌పామ్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. మొక్క నాటిన దగ్గర నుంచి పంట అమ్మకం వరకు అనేక రాయితీలు ఇస్తున్నామన్నారు. నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలన్నారు. పత్తి, మిరప పంటల కంటే అధికంగా లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. రైతులు కనీసం రెండు ఎకరాల నుంచి ఐదు ఎకరాల వరకు సాగు చేస్తే ఏడాదిలో ఎకరానికి రూ.లక్ష చొప్పున ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఓ మంజుఖాన్, ఏఈఓ సుప్రియ, రైతుబంధు కో-ఆర్డినేటర్ సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



నెహ్రూసెంటర్: జిల్లాలోని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి అంబరీష అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లకు పాలియేటివ్ కేర్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అంబరీష మాట్లాడుతూ.. కేన్సర్‌తో బాధపడుతున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలు అందించాలని, హైరిస్క్ పేషెంట్లను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి పంపించి వైద్యం అందించేలా చూడాలని సూచించారు. డాక్టర్ అనిత మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌కుశిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి, డాక్టర్ రాజ్‌కుమార్, కేవీ రాజు, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుల ఉన్నతి శిక్షణకు డీఈఓ హాజరై మాట్లాడారు. శిక్షణ ద్వారా పాఠశాలలో విద్యార్థులకు మెళకువలు నేర్పించాలన్నారు. చదవడం, రావడం వంటి అభ్యసన సామర్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. మాతృభాషతో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీయడానికి తెలుగు ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళి, ఏసీజీఈ శ్రీరాములు, కోఆర్డినేటర్లు విత్తనాల సుధాకర్, సదయ్య, ఆర్పీలు సురేష్, ప్రసాద్, హరీశ్, ప్రవీణ్ తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదుగురు డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బుధవారం నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ సెకండియర్ పరీక్షల్లో మూడు పరీక్ష కేంద్రాల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.నరేందర్ తెలిపారు. జనగామలోని ఏబీవి కళాశాలలో ముగ్గురు, వరంగల్ ఏఎస్ఎం కళాశాలలో ఒకరు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు వారు పేర్కొన్నారు.

కేయూకు నేడు సెలవు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కళాశాలు, క్యాంపస్‌లోని అన్ని విభాగాలు, కార్యాలయాలకు రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 31న సెలవు ప్రకటిస్తూ బుధవారం కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు సర్క్యులర్ జారీ చేశారు. న్యాక్ పనుల దృష్ట్యా ఈఏడాది మే నెలలో 13, 14, 15 తేదీల్లో పబ్లిక్ హాలీడేస్‌లలో యూనివర్సిటీ క్యాంపస్‌లో పని దినాలుగా పరిగణించారు. ఆ పనిదినాల్లో ఒకరోజుకు బదులుగా ఈనెల 31న సెలవును ప్రకటిస్తున్నట్లు రిజిస్ట్రార్ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

రక్షాబంధన్ సందడి

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. గురువారం జిల్లా వ్యాప్తంగా రాఖీ పండుగను జరుపుకోనున్నారు. ఈ మేరకు బుధవారం మానుకోట పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన రాఖీల షాపుల వద్ద సందడి నెలకొంది. మహిళలు రాఖీలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. అలాగే సోదరుల నోటిని తీపి చేసేందుకు స్వీట్ పదార్థాలు కొనుగోలు చేశారు. దీంతో ఆయా షాపుల వద్ద రద్దీ నెలకొంది.

- సాక్షి,స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



రంగురంగుల్లో ఆకర్షిస్తున్న రాఖీలు







నెహ్రూ సెంటర్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

వాటాలా దళితబంధు!

ఒక యూనిట్ ఐదారుగురికి కేటాయింపు

- సమష్టిగా పంచుకోవాలని ఆదేశాలు
- ఎన్నికల సీజన్ కావడంతో నాయకుల ఎత్తుగడ
- మా దృష్టికి రాలేదంటున్న అధికారులు

సాక్షి, మహబూబాబాద్: దళితుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం కొత్త పుంతలు తొక్కుతోంది. మొదటి విడతలో ఒక కుటుంబానికి ఒక యూనిట్ అందజేసిన ప్రజాప్రతినిధులు.. ప్రస్తుతం ఒక యూనిట్‌ను ఐదారుగురికి అందజేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల సీజన్ కావడంతో ఉన్న యూనిట్లనే ఎక్కువ మందికి పంచాలనే ఆలోచనలో ఉన్నారు. అయితే యూనిట్ల పంపిణీలో గొడవలు జరుగుతాయని లబ్ధిదారులు అంటున్నారు.

మొదటి విడత ఇలా..

దళితబంధు పథకం మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 100 యూనిట్ల చొప్పున మంజూరు చేశారు. జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు కలిపి 200యూనిట్లు, తొర్రూరు, పెద్దవంగర మండలాలు ఉన్న పాలకుర్తి నియోకవర్గానికి 30 యూనిట్లు, కొత్తగూడ, గంగారం మండలాలు ఉన్న ములుగు నియోజకవర్గానికి 19 యూనిట్లు, గార్ల, బయ్యారం మండలాలు ఉన్న ఇల్లెందు నియోజకవర్గానికి 56 యూనిట్లు.. మొత్తం జిల్లాకు 305 యూనిట్లు మంజూరు చేశారు. ఈ పథకం నిబంధనల ప్రకారం ఒక యూనిట్‌ను ఒక కుటుంబానికి అందజేశారు. యూనిట్ విలువ రూ. 9,90,000 కాగా.. ఎవరికి నేరుగా డబ్బులు ఇవ్వకుండా వస్తువులు, యంత్రాలు, ఇతర వాహనాల కోసం డబ్బులు జమ చేశారు. కొన్ని యూనిట్లకు అయితే సగం డబ్బులు ముందుగా మంజూరు చేసి.. యూనిట్ నడుస్తుందని నిర్ధారించుకున్న తర్వాత మిగిలిన డబ్బులు జమ చేశారు.



ప్రస్తుతం వాటాలు.. ?

దళితబంధు రెండో విడత లబ్ధిదారుల ఎంపిక గతంలో మాదిరిగా కాకుండా రోజుకో విధంగా మార్పు చెందుతుందని తెలిసింది. ప్రతి నియోజకవర్గానికి 11,00 చొప్పున మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు కలిపి 2,200 యూనిట్లు, అదేవిధంగా పాలకుర్తి, ఇల్లెందు, ములుగు నియోజకవర్గాల్లోని ఆరు మండలాలకు మరో వెయ్యి యూనిట్ల వరకు మంజూరు చేసే అవకాశం ఉంది. దీంతో జిల్లాలో రెండో విడతలో మొత్తం 3,200 పైగా యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అయితే మరికొద్ది రోజుల్లో ఎన్నికలు ఉండడంతో లబ్ధిదారుల ఎంపిక నాయకులకు తలనొప్పిగా మారింది. ఒక్కరికే రూ.10లక్షలు ఇవ్వడం కంటే.. ఒక్కో యూనిట్‌ను ఐదారుగురికి పంచితే ఎక్కువ మందిని మెప్పించవచ్చనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. దీంతో గ్రామాలకు కేటాయించిన యూనిట్లు, అక్కడ దరఖాస్తు చేసుకున్నవారి సంఖ్యను ఆధారంగా చేసుకొని యూనిట్లు వాటాలు వేస్తున్నట్లు తెలిసింది. యూనిట్ మంజూరు ఒక్కరి పేరునే ఉంటుందని, వచ్చిన డబ్బులు అందరూ పంచుకోవాలని నాయకులు చెబుతున్నట్లు సమాచారం. మూడో విడతలో అందరికి సెటిల్ చేస్తామని చెబుతున్నట్లు తెలిసింది. అయితే దళిత బంధు పేరుతో ఎన్నో కొన్ని డబ్బులు వస్తున్నాయని సంబురపడే వారు కొందరు ఉంటే.. ఈ పథకం ద్వారా రూ.10లక్షలు వస్తే మంచి యూనిట్ పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకోవచ్చని ప్రణాళికతో ఉన్నవారు మాత్రం ఆందోళన చెందుతున్నారు.

నిబంధనల్లో మార్పులేమి లేవు..



దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో మొదటి విడతకు ఇప్పటికి నిబంధనల్లో మార్పులేమి లేవు. నూరుశాతం సబ్సిడీతో యూనిట్ రూ.9,90,000 మంజూరు చేస్తాం. డబ్బులు నేరుగా లబ్ధిదారుడికి కాకుండా కొనుగోలు చేసిన యూనిట్, కొటేషన్ ప్రకారం ఆయా కంపెనీలు, షాపుల యజమానుల పేరుతో చెక్‌లు లేదా.. ఆన్‌లైన్ పేమెంట్ చేస్తాం. యూనిట్‌ను వాటాలు వేసుకునే విషయం మా దృష్టికి రాలేదు.

- బాల్‌రాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

బేడ బుడిగ జంగాల సంక్షేమానికి కృషి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



నాయకులకు భూ కేటాయింపు కాపీని అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: బేడ బుడిగజంగాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంత్రి దయాకర్‌రావు తొర్రూరులో బేడ బుడిగ జంగాలకు ఫంక్షన్ హాల్ నిమిత్తం ఎకరం భూమి, నిర్మాణానికి రూ.కోటి నిధులు కేటాయించారు. దీనిని హర్షిస్తూ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలో మంత్రిని బేడ బుడిగ జంగాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. భూ కేటాయింపు, నిధుల మంజూరు ఉత్తర్వుల కాపీని సంఘం నాయకులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బేడ బుడిగ జంగాల సామాజిక వర్గానికి సంక్షేమ పథకాలు, దళితబంధు పథకంలో ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఆ సామాజిక వర్గానికి ఎంపీపీ, మూడు కౌన్సిలర్ పదవులు ఇచ్చి రాజకీయంగా సముచిత స్థానం కల్పించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అల్లం అర్జున్‌రాజు, నాయకులు కడెం యాకయ్య, కిన్నెర పాండు, చార్ల కృష్ణ, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, గంధం గోపాల్, నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు..



ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు

గంగారం: ఇటీవల కరిసిన భారీ వర్షాలు, వరదల ఉధృతితో మండలంలోని నర్సంపేట- ఇల్లందు ప్రధాన రహదారిలోని కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు, వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో దెబ్బతిన్న కల్వర్టు గుంతల్లో పడి ప్రమాదాలు జరిగిన సంఘటన ఉన్నాయి. ఇంత జరుగుతున్నా.. అధికారులు కల్వర్టు వైపు కన్నెత్తి చూడడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి వాహనదారుల కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

వేతన వెతలు



డోర్నకల్ మున్సిపల్ కార్యాలయం



విధుల్లో పారిశుద్ధ్య కార్మికులు

- నాలుగు నెలల జీతాలు అందని వైనం
- ఇబ్బందుల్లో మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు

డోర్నకల్: జిల్లాలోని డోర్నకల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల వేతనాలు అందలేదు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో 27మంది పారిశుద్ధ్య కార్మికులు, నలుగురు పంప్ ఆపరేటర్లు, ఐదుగురు ఎలక్ట్రీషియన్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, నైట్‌వాచ్‌మెన్ తదితరులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి నెలనెలా జనరల్ ఫండ్ నుంచి సుమారు రూ.6.50లక్షల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. గత జనవరి నెలతో పాటు మే, జూన్, జూలై మాసాలకు సంబంధించిన వేతనాలు కార్మికులకు అందలేదు. మధ్యలో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెల వేతనాలు మాత్రమే అందించారు. ప్రస్తుతం ఆగస్టు నెల కూడా పూర్తి కావడంతో ఐదు నెలల వేతనాలు అదించాల్సి ఉంది. జనరల్ ఫండ్‌కు పన్నుల రూపంలో భారీగా ఆదాయం సమకూరుతున్నా.. సకాలంలో తమకు వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు వాపోతున్నారు. పేద కుటుంబాలకు చెందిన తాము నెలల తరబడి వేతనాల అందక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని, వడ్డీలు పెరిగి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు సకాలంలో వేతనాలు అందడం లేదని, దీంతో కుటుంబాలతో కలిసి పండుగలు కూడా సంతోషంగా జరుపుకోవడం లేదని చెబుతున్నారు. అధికారులు, పాలకవర్గం స్పందించి తమకు నెలనెలా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. సమస్యపై మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ మాట్లాడుతూ తాము కార్మికుల రెండు నెలల వేతనాల బిల్లులు చేసి పంపామని, మరో రెండు నెలల వేతనాలు బిల్లులు కూడా పంపుతామని చెప్పారు.

చాప్లాతండాను ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ శశాంక



చాప్లాతండాలో పర్యటిస్తున్న కలెక్టర్ శశాంక

దోర్నకల్: చాప్లాతండా గ్రామంలో జరిగిన అభివృద్ధిని ఇతర గ్రామాల ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. మండంలోని చాప్లాతండా గ్రామంలో బుధవారం కలెక్టర్ పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గోబర్ బయోగ్యాస్ ప్లాంట్‌ను ప్రారంభించి స్టౌ వెలిగించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించి.. అందరికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సర్పంచ్‌కు సూచించారు. గ్రంథాలయంలో టేబుల్, కుర్చీలు ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఓ సన్యాసయ్యను ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి గ్రామంలో జరిగే వేడుకల్లో భోజనాలు చేసేందుకు ఉచితంగా పంపిణీ చేస్తున్న స్టీల్ ప్లేట్లు, గ్లాసులను పరిశీలించారు. గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జాప్యం చేయవద్దన్నారు. గ్రామాభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ తక్కువ మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. గ్రామంలో ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ మంది ఉన్నారని, కేంద్రాలను తగ్గించాలని సీడీపీఓకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చాప్లాతండా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కృషితో ఇక్కడ అద్భుతమైన అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం సర్పంచ్ బానోత్ పాండునాయక్, పంచాయతీ కార్యదర్శి సంపత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీపీఓ నర్మద, ఎంపీడీఓ చలపతిరావు, తహసీల్దార్ నాగభవాని, ఎంపీఓ ముస్లర్‌బేగ్, సీడీపీఓ ఎల్లమ్మ, ఉపసర్పంచ్ మోహన్, ఈజీఎస్ ఏపీఎం మధు, ఈసీ రఘు, ఎస్‌బీఎం మేనేజర్ రవికుమార్, ఆర్‌ఐ రఘు తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామికి అందజేయాలి..

మహబూబాబాద్: వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భార్య కానీ, భర్తకానీ మృతిచెందితే వెంటనే భాగస్వామికి పింఛన్ వర్తింపజేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పంఛన్, తదితర విషయాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 86 శాతం మాత్రమే పింఛన్ పంపిణీ చేస్తున్నారని,మిగతా వారి సమస్య పరిష్కరించి అందజేయాలని ఆదేశించారు.

అవగాహన ఉండాలి

వివిధ శాఖల నుంచి బీఎల్‌ఓలుగా నియామకమైన వారికి పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీఎల్‌ఓల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల తొలగింపులు, చేర్పులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి సన్యాసయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు పొందాలి..

ట్రాన్స్‌జెండర్లు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో ట్రాన్స్‌జెండర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. థర్డ్‌జెండర్లు కోరినవిధంగా ఐడీ కార్డులు అందజేయాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి



కుష్టు సర్వే వివరాలను తెలుసుకుంటున్న కేంద్ర బృందం

తొర్రూరు: కుష్టు వ్యాధి నిర్మూలనకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని కేంద్ర నీతి ఆయోగ్ బృందం సభ్యుడు డాక్టర్ నిర్మల్ తెలిపారు. కేంద్ర నీతి ఆయోగ్ బృందం సభ్యులు బుధవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. కుష్టు వ్యాధి బాధితుల గుర్తింపు సర్వే తీరు, మందుల పంపిణీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై కేంద్ర బృందం ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు.అన్ని జాతీయ కార్యక్రమాల పరిశీలనతో పాటు ఓపీ సేవలు, ల్యాబ్, ఫార్మసీ, గర్భిణుల నమోదు, బాలింతల గృహ సందర్శన, టీబీ, కుష్టు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. కుష్టు నివారణకు అవసరమైన మందులు బాధితులకు అందించాలని, ఆరు నెలల నుంచి ఏడాది పాటు క్రమం తప్పకుండా మందులు వాడేలా బాధితులకు అవగాహన కల్పించాలని డాక్టర్ నిర్మల్ సూచించారు. కార్యక్రమంలో బృంద సభ్యుడు డాక్టర్ లోకేందర్, వైద్యులు బిందుశ్రీ, జ్వలిత, మానస, డీపీఎంఓ వనాకర్‌రెడ్డి, సీహెచ్‌ఓ రుద్రపతి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వేయాలని ర్యాలీ, రాస్తారోకో

- పోలీసులు, పీడీఎస్‌యూ నాయకుల మధ్య వాగ్వాదం
- పలువురి అరెస్ట్



రాస్తారోకో చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు తదితరులు

కేయూ క్యాంపస్: డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేయూలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. క్యాంపస్‌లోని లైబ్రరీ నుంచి రెండో గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. గేట్ ఎదుట కరీంనగర్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ స్వయంగా 13,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించి కూడా ఇప్పుడు ఆ పోస్టులను తగ్గించడం సరికాదన్నారు. మిగిలిన పోస్టులు కలిపి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తే నిరుద్యోగులతో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులను అరెస్టు చేయడం అక్రమమన్నారు. రాస్తారోకో చేస్తున్నవారిని అక్కడి నుంచి పంపించేందుకు పోలీసులు యత్నించగా.. విద్యార్థులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, కేయూ బాధ్యులు నరేశ్, రమేశ్‌ను కేయూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆందోళనలో పీడీఎస్‌యూ వరంగల్ జిల్లా కార్యదర్శి ఆలువాల నరేశ్, బాధ్యులు అభిరామ్, రమేశ్, వేణు, శ్రీనివాస్, అజయ్, సేవియా, గోపాల్, రాకేశ్, సంగీత, రజియా సుల్తానా, మౌనిక, రవళి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా వాసికి కీలక బాధ్యత



హన్మకొండ: బీజేపీ తెలంగాణ రాష్ట్ర డాటా అండ్ కాల్ సెంటర్ టీమ్ కన్వీనర్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లావాసి రావుల భరత్ రెడ్డికి అధిష్టానం కీలక బాధ్యత అప్పగించింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి చెందిన రావుల భరత్‌రెడ్డి విద్యార్థి దశలోనే ఏబీవీపీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. యూకేలో ఉన్నత విద్య పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేసిన ఆయన.. రాజకీయాలపై మక్కువతో స్వదేశం చేరుకుని బీజేపీలో కీలక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యుదాఘాతంతో రైతు మృతి



కరెంట్‌షాక్‌కు గురై మృతి చెందిన రైతు శంకర్

తొర్రూరు రూరల్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని టీక్యాతండా జీపీ శివారు జగ్నతండాలో జరిగింది. తండాకు చెందిన జాటోత్ శంకర్(50) బుధవారం తన పశువులకు పొలంలో గడ్డి కొస్తున్నాడు. ఈ క్రమంలో వేలాడుతున్న కరెంట్ సర్వీస్ వైర్‌ను గమనించకుండా తాకాడు. దీంతో విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య సోమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.





సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■హన్మకొండ సప్తగిరి కాలనీలో 150 చ॥గ॥ల నార్త్ ఫేసింగ్ గల ప్లాటు అమ్మకానికి కలదు. (నో బ్రోకర్స్) సంప్ర॥ సెల్: 9441001574. [W-189158]

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్లె 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27212]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డు, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27215]

HOUSE FOR SALE/RENT

■హన్మకొండ హంటర్ రోడ్ సమీపంలో 280 చ॥గ॥లో 3BHK ఇండిపెండెంట్ హౌజ్ అమ్మకానికి లేదా అద్దెకు ఇవ్వబడును. సెల్: 9949184625. [W-189153]

FARM PLOTS FOR SALE

■ఆనందవనం ఫేస్ 7 నందు ఫామ్ ల్యాండు కొలన్‌పాక, యాదాద్రి నందు ఫామ్ ల్యాండు ఆఫర్ 5+1 ప్లాట్ నందు 5 తీసుకొన్న 1 ప్లాట్ ఫ్రీ Plot Rate 4999/-. సంప్ర॥ 9014743326. [W-189141]

WANTED

■ మా రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు అసోసియేట్ మెంబర్స్ మరియు టెలికాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటీవ్స్ + కమీషన్ ఇవ్వబడును. సంప్ర॥ 9959567858. [W-189148]

■ WGL, Experienced కార్ టెక్నీషియన్స్, హెల్పర్స్ కావలెను. సాలరీ: 20,000/- మా మోటార్స్ ములుగు X రోడ్ వరంగల్, సెల్: 9948434745, 9000687574. [WA-541]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాధితులకు సోదరులై..

వరదతో సర్వస్వం కోల్పోయిన వారికి ఆత్మీయ బంధువులుగా నిలిచారు..

వారు అక్కాతమ్ముళ్లు కాదు.. చెల్లి అన్నయ్యలు కాదు.. అసలే రక్త సంబంధం కాదు.. ఒకరంటే ఒకరికి పరిచయం లేదు. కానీ వారిని ఓ బంధం కలిపింది. అదే వరద బంధం. తోబుట్టువులు కూడా ఆదరించలేని ఈ రోజుల్లో ఎలాంటి సంబంధం లేని వారు 'అధైర్య పడకండి.. మేమున్నామంటూ' క'న్నీటి' వరద నుంచి కాపాడారు. ఇటీవల కురిసిన వర్షం వరంగల్ నగరంతోపాటు భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. నిత్యావసరాల నుంచి గృహోపకరణాల వరకు సర్వం వరదలో కొట్టుకుపోయాయి. కట్టుబట్టలు మాత్రమే మిగిలి హాహాకారాలు చేస్తున్న సమయంలో తామున్నమంటూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకువచ్చారు. తమకు తోచిన సాయం అందించి వరద బాధితులను క'న్నీటి' కష్టం నుంచి గట్టెక్కించారు. దీంతో నిరాశ్రయులు వారికి శతకోటి వందనాలు పెట్టారు. ఆపదలో కాపాడిన వారే తమకు నిజమైన రక్తసంబంధీకులు అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా వరద బాధితలకు చేయూతనందించి ప్రేమబంధం చాటిన వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ ఏటూరునాగారం

సోదరుల్లా అక్కున చేర్చుకున్నారు..

- సామాజిక సేవలో శివనగర్ మిత్ర మండలి ఆదర్శం..
- వరద బాధితులకు పలు రకాలుగా చేయూత

వరద ముంపు బాధితులకు శివనగర్‌లో ఏర్పాటు చేసిన శివనగర్ మిత్రమండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ అండగా నిలిచింది. మానవతా దృక్పథంతో మేమున్నామంటూ నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేసింది. వరదల్లో చిక్కుకుని కనీసం తాగేందుకు నీరు, తినడానికి ఆహారం కూడా లభించని సమయాన బాధితుల కన్నీళ్లు తుడిచేందుకు శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ మేరుగు అశోక్ తోబుట్టువులా ముందుకు వచ్చారు. బాధితులను అక్కున చేర్చుకుని ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసి వారి ఆకలితీర్చారు. దీంతో పలువురు సమాజసేవకులు మేరుగు అశోక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు.



వరద బాధితులకు కూరగాయలు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు (ఫైల్)

తోబుట్టువులా ఆదుకున్నారు..



ఇటీవల కురిసిన వర్షాలకు మా కాలనీ మొత్తం జలమయమైంది. కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఆ సమయంలో తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. దీంతో మీకు మేమున్నామంటూ శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ బాధ్యులు ముందుకువచ్చారు. తోబుట్టువులా నిలిచి మమ్ములను ఆదుకున్నారు. వారే నాకు నిజమైన సోదరులు. వారికే రాఖీ కట్టి సోదరభావం చాటుకుంటా.

అల్లం స్వరూప, శివనగర్

రక్త సంబంధీకులు కాకపోయినా..



గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో ప్రతి ఇంట్లో వస్తువులు కొట్టుకుపోయి ఇబ్బందులు పడ్డాం. మా బాధలను తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్ని రకాల సహకారం అందించారు. రక్త సంబంధీకులు కాకపోయినా ఎక్కడి నుంచో వచ్చి మాకు సరుకులు అందించారు. వారి సహకారంతో కొంత ఉపశమనం పొందాం.

-కొత్త సుదర్శన్‌రెడ్డి, రైతు మోరంచపల్లి

వారి సహకారం మరువలేనిది



గ్రామంలో వరద కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనగా కుటుంబీకులు, తోడ పుట్టిన వారు ఓదార్చే తప్ప ఎవరూ ఆదుకోవడానికి ముందుకు రాలేదు. కానీ వేర్వేరు గ్రామాల నుంచి మాకు పరిచయం లేని వ్యక్తులు వచ్చి వంట సామాను, చద్దర్లు, డబ్బు, అన్నదానం, మంచి నీళ్ల పంపిణీ చేశారు. వారి సహకారం జీవితంలో మర్చిపోలేం.

-చుక్క కవిత, గృహిణి, మోరంచపల్లి



మోరంచపల్లిలో వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)

స్వచ్ఛంద సంస్థలు, దాతల ఔదార్యం

- వరద బాధితులకు ఆపన్నహస్తం

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లో గత నెలలో సంభవించిన వరదలతో గ్రామస్తులు సర్వస్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలి పుట్టెడు దుఃఖంలో వీరికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు అండగా నిలిచాయి. సోదరుల వలే మనోధైర్యం నింపుతూ నిత్యావసరాలు, దుస్తులు అందజేసి ఆసరా అయ్యారు. దీంతో ఆడబిడ్డకు పుట్టినింటి నుంచి పంపినట్లు నిత్యావసరాలు అందజేసి తమను ఆదుకున్నారని, వీరి సేవలను జన్మలో మరిచిపోలేమని వరద బాధితులు పేర్కొన్నారు.

వరదలతో అతలాకుతలం



వరదలతో కొండాయి గ్రామం పూర్తిగా అతలాకుతలమైంది. నిరాశ్రయులుగా మిగిలిన మమ్ములను స్వచ్ఛంద సంస్థలు, మహిళా ప్రతినిధులు అక్కా, చెల్లెల్లవలే వచ్చి ఆదుకున్నారు. కట్టుబట్టలతో రోడ్డున పడిన మాకు దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసి ఆదుకున్నారు. వారి సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేం.

-కట్ల సందీప్, కొండాయి

సొంతోళ్లు కూడా ఇలా చేయరు..



ఇల్లు నీటిలో మునిగి దిక్కు తోచని స్థితిలో ఉన్న సమయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు మా దగ్గర వచ్చి కావాల్సిన వస్తువులు అందజేసి ఆదుకున్నారు. సొంతోళ్లు కుడా ఇలా చేయరు. దీనిపై వారికి జన్మజన్మలకు రుణపడి ఉంటాం.

-బొల్లికుంట లక్ష్మి,మల్యాల



హసన్‌పర్తి: రాఖీ ఆకారంలో పెంబర్తిలోని ఏకశిల టెక్నో పాఠశాల విద్యార్థులు

కంబాలపల్లిలో వృక్ష రక్షాబంధన్

- పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం మొక్కలు, చెట్లకు రక్షాబంధన్ చేశారు. తమ పరిసరాల్లోని మొక్కలు, చెట్లను కాపాడుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హెచ్‌ఎం రమేశ్ బాబు మాట్లాడుతూ చెట్లు పర్యావరణం, మానవులకు చేస్తున్న మేలును తెలియజేసే ఉద్దేశంతో వృక్ష రక్షాబంధన్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు, పర్యావరణ పరిశోధకుడు వి.గురునాథరావు మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన ఉండాలన్నారు. 15 సంవత్సరాలుగా ఈ వృక్ష రక్షాబంధన్ దివస్ జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రామనర్సయ్య, ఉప్పలయ్య, శ్రీనివాస్, తిరుపతి, సోమేశ్వర్, శోభారాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వృక్ష రక్షాబంధన్ వేడుకలు జరుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చంద్రయాన్-3 పై అవగాహన

గార్ల: చంద్రయాన్-3పై గార్ల వాసి, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ గంజి వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3తో చంద్రుడి దక్షిణార్థ గోళంలో విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేసే హీలియం ఖనిజం నిక్షిప్తమైనట్లు గుర్తించామన్నారు. పది కేజీల హీలియం ఖనిజం పొందగలిగితే రాష్ట్రానికి సంవత్సరం పాటు విద్యుత్‌ను అందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఆయనను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చార్లి, అజిత్, సుందరయ్య, రాజేష్, వెంకన్న, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రయాన్-3 గురించి వివరిస్తున్న వెంకటనారాయణ

కర్రతో కొట్టి.. ఉరివేసి..

- భార్యను కడతేర్చిన భర్త..
- కాశిగూడెంలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసైన భర్త.. భార్యను దారుణంగా కడతేర్చాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేశారు. ఈ ఘటన మండలంలోని రంగరాయగూడెం శివారు కాశిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కాశిగూడేనికి చెందిన షేక్ ఖాసీమ్ కుమార్తె సయ్యద్ హజరత్‌బీ(28)కి తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన అమీర్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. హజరత్‌బీ, అమీర్ దంపతులు కొన్నేళ్లుగా కాశిగూడెంలో బండ కొట్టే పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అమీర్.. తరచూ భార్యతో గొడవపడేవాడు. తాను మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని వేధించేవాడు. ఈ క్రమంలో అమీర్ మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి తాగేందుకు డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవపడ్డాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేసి పారిపోయాడు. బుధవారం ఉదయం హజరత్ మృతిచెంది ఉన్న విషయాన్ని గుర్తించిన ఆమె తండ్రి ఖాసీం చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవేందర్ ఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితుడు పరారీలో ఉన్నాడు.



హజరత్‌బీ (ఫైల్)

కొడుకుపై తండ్రి హత్యాయత్నం

- ఆలేరులో ఘటన.. కేసు నమోదు

నెల్లికుదురు: కొడుకుపై తండ్రి హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఈ నెల 27న మండలంలోని ఆలేరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జనగాం మౌనిక, నరేశ్‌కు 5 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు నవదీప్, కూతురు ఉన్నారు. నరేశ్ మద్యానికి బానిసై భార్య మౌనికను రోజూ కొడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 15న కూడా మద్యం సేవించి వచ్చి కొట్టగా మౌనిక తన తల్లిగారి ఊరు సూరిపెల్లికి వెళ్లిపోయింది. నరేశ్ ఈ నెల 27న సూరిపెల్లికి వెళ్లి భార్యతో గొడవపడి కుమారుడు నవదీప్‌ను తనతో ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం మద్యం మత్తులో అదే రోజు రాత్రి కుమారుడిపై హత్యాయత్నానికి పాల్పడాడు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు బాబుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి మౌనికకు విషయం తెలిపారు. మౌనిక ఫిర్యాదు మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ వివరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

మరిపెడ: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకులతండాలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మాకులతండాకు చెందిన గుగులలోతు అమృ(27) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో భార్య ప్రమీలతో కలిసి వ్యవసాయ చేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావడం, కుటుంబ పోషణ గడవకపోవడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్ద అమృ పురుగుల మందు తాగడంతో గమనించిన భార్య.. చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ సీజ్

- కంపెనీపై దాడి.. రూ.2.88 లక్షల విలువైన 20 క్వింటాళ్ల పేస్ట్ స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కంపెనీలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి ముగ్గురు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. వారినుంచి రూ.2.88లక్షల విలువైన 20క్వింటాళ్ల అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన గాయి సతీష్ శ్రీభద్రకాళీ మాత అల్లం, వెల్లుల్లి తయారీ చేసే కంపెనీ ఏర్పాటు చేయగా, అదే ప్రాంతానికి చెందిన బిలకిష్ అబువాని మరో కంపెనీ స్థాపించాడు. అదే ప్రాంతానికి చెందిన కూరపాటి నాగరాజు కూడా జై గణేష్ అల్లం, వెల్లుల్లి పేస్ట్ కంపెనీ ఉంది. ముగ్గురు రసాయనాలు కలిపి పేస్ట్ విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు పక్కా సమాచారం అందింది. సీపీ రంగనాథ్ ఆదేశాలు.. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సూచనల మేరకు పోలీసులు బుధవారం రాత్రి సతీష్, బిలకిషన్ అబువాని, నాగరాజుకు చెందిన కంపెనీలపై ఆకస్మిక దాడి చేశారు. ముగ్గురుపై కేసు నమోదు చేసి వారినుంచి అల్లం, వెల్లుల్లి పేస్ట్, తయారీకి ఉపయోగించే ముడిసరుకులను సీజ్ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రాంబాబు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య..

- కాంట్రాక్ట్ డబ్బులు అడిగినందుకు ఘాతుకం..
- శివనగర్‌లో కలకలం
- పోలీసుల అదుపులో ఓ నిందితుడు?
- కొరవడిన నిఘా.. యథేచ్ఛగా హత్యలు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం ఇదే పీఎస్ పరిధిలో ఇద్దరు నిందితులు ఓ వృద్ధుడిని గొంతు కోసి అతికిరాతంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరవక ముందే మంగళవారం అర్ధరాత్రి ఓ రౌడీషీటర్‌ను ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు రాడ్లతో తలపై కొట్టి దారుణంగా హతమార్చారు. ఈ ఘటన నగర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ శివనగర్‌కు చెందిన ఎస్‌డీ నజీర్ (37) వరంగల్ రైల్వేస్టేషన్‌లో సబ్ కాంట్రాక్ట్ తీసుకుని మొబైల్ క్యాంటీన్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడిపై మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. అతనిపై రౌడీషీట్ ఉంది. ఇదిలా ఉండగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పదిమంది వ్యక్తులు బతుకు దెరువు కోసం వరంగల్ వచ్చి శివనగర్‌లో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా రైల్వే స్టేషన్ ప్రాంగణం, రైళ్లల్లో ఎలక్ట్రానిక్స్ గూడ్స్, కీచైన్స్, పర్సులు విక్రయిస్తారు. వీరు స్టేషన్‌లో చిరువ్యాపారం చేసుకునేందుకు సబ్ కాంట్రాక్టర్, మృతుడు నజీర్‌కు నెల వారీగా అద్దె చెల్లించాలి. అయితే చిరువ్యాపారం చేస్తున్నారు. కానీ కాంట్రాక్ట్ డబ్బులు చెల్లించకుండా తిరుగుతున్నారు. రేపు మాపు అంటూ దాటవేస్తున్నారు.

ఇంటికి వెళ్తూ హత్యకు గురై..

మంగళవారం అర్ధరాత్రి నజీర్ క్యాంటీన్ బంద్ చేసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శివనగర్‌లోని తిరుమల బార్ పక్కనే ఉత్తర్‌ప్రదేశ్ వారు అద్దెకుంటున్న గదికి చేరుకున్నాడు. ఇరువురు మధ్య కాంట్రాక్ట్ డబ్బుల విషయంలో గొడవ జరగడంతో వారిని నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు ఐరన్‌రాడ్లతో నజీర్ తలపై బలంగా కొట్టడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. నజీర్ చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం వారు గది నుంచి పారిపోయారు. ఈవిషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించి మృతుడి బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం నజీర్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రిజ్వాన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీలత తెలిపారు. కాగా, నగరంలో నిఘా కొరవడడంతోనే వరుస హత్యలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



నజీర్ (ఫైల్)

పోలీసుల అదుపులో నిందితుడు..?

నజీర్‌ను దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితులు పరారయ్యారు. వీరిలో ఓ వ్యక్తిని రైల్వేస్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ తరలించినట్లు సమాచారం. పదేపదే తమను కాంట్రాక్ట్ డబ్బులు అడగడం వల్ల.. పైగా బెదిరించడంతో ఆత్మరక్షణకు హత్య చేశామని చెప్పినట్లు తెలుస్తోంది.

తల్వార్ ఫ్లెక్సీ తొలగింపు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాలపురం పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఓ పార్టీ నాయకుడు తన జన్మదినాన్ని పురస్కరించుకుని తల్వార్ పట్టుకుని ఉన్న ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. బుధవారం గుర్తించిన పోలీసులు ఫ్లెక్సీని తొలగించారు.



ఫ్లెక్సీని తొలగిస్తున్న పోలీసులు



నీలి చందమామ..సొగసు చూడతరమా అన్నట్టు కనిపించింది. బుధవారం రాత్రి చంద్రుడు.. భూమికి దగ్గరగా రావడంతో చాలా పెద్దగా కనిపించారు. వరంగల్ నగరంలో రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇలా నీలిరంగులో సూపర్ మూన్ దర్శనమిచ్చారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ